

# అభిజ్ఞ

## – భార్గవ చందు



### *11*

ఫస్ట్ ఎయిడ్ కోసం నితిన్ ని క్యాజువాలిటీ వార్డ్ కి చేర్చింది అభిజ్ఞ. వార్డ్ లో ఉన్న డాక్టర్ అభిజ్ఞ ని బయట వెయిట్ చేయమని చెప్పాడు.

30 నిమిషాలు గడిచాక, అతని పరిస్థితి విషమంగా ఉందని ఐసియూకి షిఫ్ట్ చేశారు. ఏం జరుగుతుందో పూర్తిగా అర్థంకాని స్థితిలో త్రిలోక్ కి కాల్ చేసింది అభిజ్ఞ.

“హలో అభిజ్ఞా! చెప్పు ఏమైనా ఆధారాలు దొరికాయా!” ఫోన్ లిఫ్ట్ చేయగానే అడిగాడు త్రిలోక్.

“దొరికాయి త్రిలోక్ గారు, ముఖ్యమైన ఆధారాలు దొరికాయి. వాళ్ళు వేసుకునే సూట్ లో ఒక పొగమంచు లాంటి పదార్థం ఒకటి ఉంది. దానిని పట్టుకోగానే నితిన్ చేతికి గాయం అయ్యింది. చిన్న గాయమే అని హాస్పిటల్కి తీసుకొస్తే ఇక్కడ వీళ్ళు ఐసియూలోకి తీసుకెళ్ళారు” అని జరిగింది చెప్పింది అభిజ్ఞ.

“హాస్పిటల్ డీటైల్స్ నాకు మెసేజ్ చెయ్, దగ్గర్లో ఉన్న పోలీసు స్టేషన్ డీటైల్స్ కనుక్కుని నీకు సాయంగా ఎవరినైనా పంపిస్తా. నితిన్ గురించి కంగారు పడద్దు తనకి ఏమీ కాదు, నేను స్టార్ట్ అవుతున్నాను, వీలైనంత త్వరగా అక్కడకి చేరుకుంటా” అని చెప్పాడు త్రిలోక్.

“సరే సర్...” అని చెప్పి కాల్ కట్ చేసింది అభిజ్ఞ.

ఆరోజు చీకటి పడే సమయానికి నితిన్ ని ట్రీట్ చేసిన డాక్టర్ బయటకి వచ్చి,

“అతని బ్లడ్ లో పొటాషియం లెవల్స్ చాలా ఎక్కువగా ఉన్నాయి. కాల్షియం గ్లూకోనేట్ ఇచ్చాము, డయాలసిస్ చేశాము, ప్రాణానికి ప్రమాదం లేదు కానీ.,” అని కొంచంసేపు ఏదో ఆలోచించి, “అతనికి క్రితం ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా?” అని అడిగాడు.

అభిజ్ఞకి తెలియకపోయినా, “లేవు” అని జవాబిచ్చింది.

"సరే, తను బాగానే ఉన్నాడు, జనరల్ వార్డ్ కి షిఫ్ట్ చేస్తారు. రేపు ఉదయం మళ్ళీ బ్లడ్ లో పొటాషియం లెవల్స్ మోనిటర్ చేసి, ఓకే అనుకుంటే డిశ్చార్జ్ చేస్తాము" అని చెప్పి వెళ్తూ వెళ్తూ "జాగ్రత్తగా చూసుకోండి, పొటాషియం రిచ్ ఫుడ్స్ ఇవ్వద్దు" అని చెప్పాడు డాక్టర్.

★★★

20 నిమిషాల తర్వాత నితిన్ ని జనరల్ వార్డ్ కి షిఫ్ట్ చేశారు.

"ఇప్పుడు ఎలా ఉంది?" అడిగింది అభిజ్ఞ.

"ఎందుకు హాస్పిటల్ లో అడ్మిట్ చేశారు? చిన్న గాయమే కదా.." జరిగింది తెలియక నవ్వుతూ అన్నాడు నితిన్.

"చిన్న గాయమే, ఎంత చిన్నదంటే ప్రాణం తీసేంత చిన్నది" అని జవాబిచ్చింది అభిజ్ఞ.

"ఏంటీ?"

"ముందు రెస్ట్ తీసుకో, రేపు ఉదయానికి త్రిలోక్ సర్ వస్తారు. మిగిలినవి నేనూ, సర్ కలిసి చూసుకుంటాం" అంది అభిజ్ఞ.

"ఏంటి మీరు చూసుకునేది? మీ విషయంలో చనిపోయింది మీ అక్క, కానీ నా విషయంలో చనిపోయింది ప్రాణానికి ప్రాణమైన నా పిల్ల.," అన్నాడు నితిన్.

అభిజ్ఞ నితిన్ ని కొంచం సీరియస్ గా చూసింది.

"ఏంటా చూపు!?" అడిగాడు నితిన్.

"నీకు అక్క లేదు కదా, అలాగే ఉంటుందిలే" అంది అభిజ్ఞ.

"చెల్లి ఉన్నా సరే.. అక్కా ఉన్నా సరే., ప్రేమించిన అమ్మాయికంటే ఎక్కువనా?" అన్నాడు నితిన్.

"అయ్యో!!అస్సలు కాదు. మీదే కదా రక్త బంధం, చంటి బిడ్డల వయసు నుంచి కలిసి పెరిగారు కాబట్టి మీ బంధమే గొప్పది" అంది అభిజ్ఞ.

నితిన్ కి అభిజ్ఞ మాటల్లోని పదును తెలిసింది. ఏం జవాబు చెప్పాలో అర్థంకాక,

"సరే! నీకు మీ మనోజ్ఞ ఎంత ఇష్టమో నాకు నా పిల్ల అంతే ఇష్టం కాబట్టి, ఏది చేసినా నేను కూడా ఉండాల్సిందే" అని నితిన్ చెప్తుండగా ఒక ఇన్స్పెక్టర్ ఆ వార్డ్ లోపలికి వచ్చాడు.

అభిజ్ఞ అతనిని చూస్తూ, "త్రిలోక్ సర్ పంపించారా!?" అని అడిగింది.

అవును అన్నట్లు తల కదిల్చాడు అతను.

"సరే నితిన్, నువ్వు రెస్ట్ తీసుకో.. ఏది చేసినా మన ముగ్గురం కలిసే చేద్దాం" అని నితిన్ కి చెప్పి, "మీతో కొంచం మాట్లాడాలి భాటియా గారు!!" అని ఇన్స్పెక్టర్ ని బయటకి పిలిచింది అభిజ్ఞ.

★★★

మరుసటి రోజు ఉదయానికి త్రిలోక్ అక్కడికి చేరుకున్నాడు, నితిన్ ఆరోగ్యం నార్మల్ అయ్యింది. డాక్టర్ చెప్పిన మాటలనే త్రిలోక్ కి చెప్పింది అభిజ్ఞ.

'బ్లడ్ లో పొటాషియం లెవెల్స్ ఎక్కువ ఉండటం' అన్న అభిజ్ఞ మాటలు వినగానే మధుకర్ చావు గుర్తొచ్చింది త్రిలోక్ కి. అభిజ్ఞ చెప్పింది అంతా విని ఒక నవ్వు నవ్వి, అభిజ్ఞను, ఇన్స్పెక్టర్ ఆషిష్ భాటియానూ చూస్తూ,

"యుద్ధంలో ఆఖరి అంకం మొదలయ్యింది, త్వరలోనే ముగుస్తుంది కూడా" అన్నాడు త్రిలోక్.

"ఇప్పుడు ఏం చేయాలి సర్?" అంది అభిజ్ఞ..

"చేజారి పోయిన ఆ సూట్ తెచ్చి దానిని ఫోరెన్సిక్ ల్యాబ్ లో అప్పగిస్తే అది ఏంటో తెలుస్తుంది, ఆ ఆధారం గట్టి దారమైతే డొంక కదిలి కథ కంచికొస్తుంది" అన్నాడు త్రిలోక్.

"తెప్పించవచ్చు సర్! దానికి ఒక మార్గం ఉంది" అంది అభిజ్ఞ.

"ఎలా?" అడిగాడు త్రిలోక్.

"సింపుల్,, మౌంటైనీరింగ్ ఘాట్ కి వెళ్దాం.. అతని ఆనవాళ్ళు గుర్తున్నాయి, కాబట్టి అతన్ని సులువుగా పట్టుకోవచ్చు" అంది అభిజ్ఞ.

"పర్లేదు, మంచి ఐడియానే కానీ, అతని దగ్గర ఆ సూట్ లేకపోతే!" అన్నాడు త్రిలోక్.

"లేకపోతే తెప్పిద్దాం, నాలుగు పీకితే నిజం చెబుతాడుగా.."

"మిమ్మల్ని ఆపినవాడి దగ్గర గన్ ఉంది కదా, అతను కూడా పోలీస్ ఆఫీసర్ అయితే నాలుగు పీకడం కష్టం అనుకుంటా?" అన్నాడు త్రిలోక్.

"పోనీ ఏం చేద్దాం మీరే చెప్పండి?" అంది అభిజ్ఞ.

"నువ్వు చెప్పిన ప్లాన్ లోనే చిన్న మార్పు చేద్దాం"

"ఏంటది?"

"మిమ్మల్ని బెదిరించి సూట్ తీసుకున్నవాడు నన్నూ, భాటియాని చూడలేదు కాబట్టి మేము అక్కడికి వెళ్తాం, వాడు ఎవరో కనుక్కునే ప్రయత్నం చేస్తాం. నువ్వు ఇంకా నితిన్ క్యాబ్ బుక్ చేసుకుని సిద్ధంగా ఉండండి. తర్వాత ఏం చేయాలో నేను చెబుతా" అన్నాడు త్రిలోక్.

★★★

మౌంటెనీరింగ్ చేయడానికి ఎంటర్ అయ్యే ఘాట్ దగ్గర ఉన్న మొదటి గేట్ కి చేరుకుని గమనిస్తే, అక్కడ చాలామంది గార్డ్స్ ఉన్నారు.

త్రిలోక్ అభిజ్ఞకి ఫోన్ చేసి,

"మిమ్మల్ని ఆపినవాడిని ఎలా గుర్తుపట్టడం?" అని అడిగాడు.

"అతను బ్లూ కలర్ స్కెచర్స్ వేసుకున్నాడు సర్..." చెప్పింది అభిజ్ఞ.

"స్కెచర్స్ ఇక్కడ ఇద్దరు ముగ్గురు వేసుకున్నారు. అన్నీ దాదాపు బ్లూ కలరే ఉన్నాయి" అన్నాడు త్రిలోక్.

"అతని దగ్గర glock 6 గన్ ఉంది" చెప్పింది అభిజ్ఞ.

"గన్ అడిగితే చూయిస్తారా? అయినా నేను నా స్టయిల్ లో ప్రయత్నిస్తా, మీరు క్యాబ్ బుక్ చేసుకున్నారా?" అడిగాడు త్రిలోక్.

నితిన్ ఫోన్ తీసుకుని "ఏం చేయమంటే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాం" అన్నాడు.

"10 నిమిషాల్లో కాల్ చేస్తా" అని చెప్పి కాల్ కట్ చేశాడు త్రిలోక్.

★★★

"దాదాపుగా 10 మంది వరకూ ఉన్నారు. అందులో బ్లూ కలర్ షూస్ వేసుకున్న వారు ముగ్గురున్నారు" అన్నాడు భాటియ.

"ఐతే ముగ్గురితో మాట్లాడదాం" అని భాటియాతో చెప్పాడు త్రిలోక్.

మొదటి వాడి దగ్గరకి వెళ్ళి, "ఏ డిపార్ట్మెంట్?" అని అడిగాడు భాటియా.

అతను పరిచయం చేసుకుని వివరాలు చెప్పాడు అతను కానిస్టేబుల్ కావడం వలన అతని దగ్గర glock 6 గన్ లేదని, అతని మాటల్లో అర్థమయ్యింది.

రెండవ అతని మాటల్లో, తను డాక్టర్ శ్యామ్ అని మెడికల్ అడ్వైజర్ అని తేలింది. అతని దగ్గర గన్ ఉండే అవకాశం లేదు కాబట్టి, మూడవ అతని దగ్గరకు వెళ్ళాడు భాటియా.

మూడవ అతని దగ్గరకి వెళ్ళే ముందు అక్కడ ఉన్న మెడికల్ అడ్వైజర్ వైపు తదేకంగా చూస్తూ కనిపించాడు త్రిలోక్.

“ఏమైంది త్రిలోక్?” అడిగాడు భాటియా.

“ఆషిష్! నాకెందుకో ఈ మెడికల్ అడ్వైజర్ మీద డౌట్ గా ఉంది”

“అతను మెడికల్ అడ్వైజర్ త్రిలోక్, అతని దగ్గర గన్ ఎందుకుంటుంది?” అడిగాడు భాటియా.

“అవునా!, సరే ఒక్క నిమిషం” అని చెప్పి అభిజ్ఞకి కాల్ చేశాడు త్రిలోక్.

“సర్! దొరికాడా అతను?” అడిగింది అభిజ్ఞ.

“నువ్వు చెప్పిన ఆనవాళ్ళు సరిపోలేదు, ఇంకేమైనా ఆనవాళ్ళు ఉన్నాయా?” అడిగాడు త్రిలోక్.

“కీ చైన్....” అంది అభిజ్ఞ.

“క్లియర్ గా చెప్పు” అన్నాడు త్రిలోక్.

“అతని దగ్గర ప్లస్ లోగో ఉండే కీ చైన్ ఉంది సర్..” చెప్పింది అభిజ్ఞ.

“ఏంటీ? మళ్ళీ చెప్పు..” అని ఫోన్ భాటియా చెవి దగ్గర పెట్టాడు త్రిలోక్.

“కీ చైన్ ఉంది సర్,. వైట్ కీ చైన్ మీద గ్రీన్ కలర్ ప్లస్ లోగో ఉన్న కీ చైన్ అతని పోకెట్ నుంచి వేలాడుతూ కనిపించింది” అని చెప్పింది అభిజ్ఞ.

భాటియా విన్నాడు. త్రిలోక్ కాల్ కట్ చేశాడు.

మళ్ళీ మొదట కలిసిన కానిస్టేబుల్ దగ్గరకి వెళ్ళి, కీ చైన్ గురించి చెప్పి అలాంటిది ఎవరి దగ్గరైనా చూసారా అని అడిగాడు భాటియా.

“అది...” అని ఆలోచిస్తూ ఆ కానిస్టేబుల్ ఎడమ వైపు ఉన్న శ్యామ్ ని చూశాడు.

“అతని దగ్గర ఉందా?” అడిగాడు భాటియా.

“ఇతను కాదు, ఉదయం వేరే అతను ఉన్నాడు అతని పేరు...” అంటూ ఆలోచనలో పడ్డాడు కానిస్టేబుల్.

“ఏంటి అతని పేరు?” అడిగాడు త్రిలోక్.

“విరాజ్...”

“నెంబర్ ఉందా?” అడిగాడు త్రిలోక్.

కానిస్టేబుల్ ఒక్క నిమిషం అని చెప్పి, శ్యామ్ దగ్గరకి వెళ్ళి నెంబర్ తీసుకొచ్చి భాటియాకి ఇచ్చాడు.

"భాటియా! ఆ నెంబర్ గురించి డీటైల్స్ కనుక్కో" అని త్రిలోక్ చెప్పిన కొద్ది నిమిషాల్లో కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి డీటైల్స్ కనుక్కున్నాడు భాటియా.

"అడ్రస్ మెసేజ్ చేశాను నితిన్., అక్కడికి వెళ్ళి నాకు కాల్ చేయండి" అని నితిన్ కి ఫోన్ చేసి చెప్పాడు త్రిలోక్.

★★★

రెండుగంటలు గడిచాక అభిజ్ఞ త్రిలోక్ కి కాల్ చేసింది.

"ఏమైంది అభిజ్ఞ?" అడిగాడు త్రిలోక్.

"ఇక్కడ ఒక చిన్న పాప ఉంది సర్, పేరు ఆశ్రిత" అని చెప్పింది అభిజ్ఞ.

"ఫోన్ స్పీకర్ ఆన్ చెయ్, విరాజ్ ఎక్కడికి వెళ్ళాడో కనుక్కో?" అన్నాడు త్రిలోక్.

నితిన్ ఆ పాపని అదే మాట అడిగితే,

"నాన్న హాస్పిటల్‌కి వెళ్ళాడు, డ్యూటీ నుంచి ఇంకా రాలేదు" అని తన భాషలో చెప్పింది ఆశ్రిత.

"ఫోన్ తన దగ్గరే ఉంచి మీరు బయటకి వెళ్ళండి అభిజ్ఞ" చెప్పాడు త్రిలోక్.

అభిజ్ఞ, నితిన్ అలాగే చేశారు.

"నీ కూతురు కావాలా లేక, నిన్న మావాళ్ళ దగ్గర్నుంచి తీసుకున్న సూట్ కావాలా?" విరాజ్ కి ఫోన్ చేసి అడిగాడు త్రిలోక్.

"ఎవరు మాట్లాడేది" అన్నాడు విరాజ్

"నేను ఎవరైతే నీకు ఎందుకు! సూట్ కావాలా? కూతురు కావాలా?"

"అసలు ఎవరు మీరు"

"పోలీస్" అన్నాడు త్రిలోక్.

విరాజ్ నమ్మలేదు పైగా వెటకారంగా ఒక నవ్వు నవ్వాడు.

"రెండు నిమిషాల్లో నీ లొకేషన్ ట్రేస్ చేసి నీ దగ్గరకి నీ కూతుర్ని పంపనా" అడిగాడు త్రిలోక్.

విరాజ్ నవ్వు ఆగింది

"అది నా దగ్గర లేదు సర్.."

"ఎక్కడుంది?" అడిగాడు త్రిలోక్.

"చెప్తే నా వాళ్ళందర్ని చంపేస్తారు సర్"

"చెప్పకపోతే నీ కూతురు దూరం అవుతుంది" అన్నాడు త్రిలోక్.

"నా కూతుర్ని ఏమీ చేయద్దు సర్" అన్నాడు విరాజ్.

"హలో" అన్నాడు త్రిలోక్.

కాల్ కట్ అయ్యింది. త్రిలోక్ మళ్ళీ కాల్ చేశాడు, ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎవరూ లిఫ్ట్ చేయలేదు. ఇక ఇలా కాదు అని అడ్రెస్ కనుక్కుని లొకేషన్ కి వెళ్లడానికి స్టార్ట్ అయ్యాడు త్రిలోక్.

ఓ 20 నిమిషాల తర్వాత విరాజ్ ఫోన్ నుంచి కాల్ వచ్చింది.

"హలో ఎవరు?" ఫోన్ లిఫ్ట్ చేసి అడిగాడు త్రిలోక్.

"మీరు ఎవరు?" అటువైపు నుంచి గట్టిగా ఒకతను అడిగాడు.

త్రిలోక్ ఫోన్ భాటియాకి ఇచ్చాడు.

"నేను ఇన్స్పెక్టర్ భాటియా.."

"సర్! నేను ఏఎస్సై రంజిత్ ని మాట్లాడుతున్నా, ఈ ఫోన్ హోల్డర్ని, పోలీస్ స్టేషన్ ముందే ఎవరో షూట్ చేశారు సర్, ఇతని ఫోనులో లాస్ట్ కాల్ మీకు చేసి ఉన్నాడు, అందుకే మీకు కాల్ చేశా"

"అతను ఒక కేస్ లో సస్పెక్ట్., అందుకే కాల్ చేశాను, ఇంతకీ అది ఏ స్టేషన్?" అడిగాడు భాటియా

"హస్తినాపుర్ సర్" చెప్పాడు రంజిత్.

"మూడు గంటల్లో అక్కడికి వస్తా రంజిత్, వచ్చాక మాట్లాడతా" అన్నాడు భాటియా.

"రాంపూర్ భాటియానే కదా సర్" అన్నాడు రంజిత్.

"హా రంజిత్!! నేనే.." అని చెప్పి కాల్ కట్ చేశాడు భాటియా.

జరిగింది త్రిలోక్ కి చెప్పాడు. త్రిలోక్ కి ఒక బిగ్ క్లూ చేజారినందుకు కోపం, ఆశ్రిత కి తన తండ్రిని దూరం చేసినందుకు బాధ రెండూ ఒకే సారి కలిగాయి.

చేసేదేమీ లేక అభిజ్ఞ, నితిన్ ని కూడా హస్తినాపుర్ కి రమ్మని త్రిలోక్ కూడా భాటియాతో కలిసి బయలుదేరాడు.

(కొనసాగింపు వచ్చే సంచిక లో...)